# కథ

టి. జి. శర్మ.

నే నంటే ప్రతివారికీ యిష్టము. ఎందుకంటే ప్రపంచంతోనే పుట్టాను. ప్రపంచమంతా నేనే నిండి యున్నాను. ప్రతీవారి సంగతీ బయట పెడుతుంటాను. ఊబుసు పోవడం ఎట్లా మఱి? నేనుండుచోట జనులు మూగనివారు లేరు. ఎచ్చటనైనా నన్ను చెప్పట మొదలెట్టారంటేచాలు. వారివారిపనులు నిలుపుకొనైనా వచ్చేస్తారు. దూరమని యెంచరు. శక్తిలేనివారమే అనీ అనుకోరు, నిద్రవస్తుందనీ అనుకోరు. నన్ను అలక్ష్యంచేసి నిద్రపోయేవారుకూడా ఉన్నారులెండి. పాపము! బిడ్డలకైతే నాయందు మిక్కుటమైన ప్రీతి 'కథచెప్పవూ. కథచెప్పవూ,' అని బ్రతిమాలుతారు. కాని నాగాలి సోకగానే ఊ, కొట్టుతూ నిద్రపోతారు.

ఎందుకా నన్నిట్లు ప్రేమిస్తున్నారని ఆలోచించాను. ఆబాలగోపాలము వినుటలో నాలో యేదో మాహాత్మ్య ముండితీరాలి. చూడండి! త్యాగంచెయ్యండని వెయ్యిసార్లు చెప్పినను తనదికాని దానిని కూడ అపహరిద్దామని చూస్తూ ఉంటే ఇంక తవదేమిస్తారు? నేను శిబిచక్రవర్తి స్వీయమాంసదానము, కర్ణుని వర్ణన, రంతిదేవుని నిరంతర త్యాగములు విశ్వదాత విషయము ఈలాటివి బయట పెట్టానా ప్రజల మనస్సులలో కొంతమార్పు కలుగక మానదు. 'సత్యంవద' అని వేదం. వేమరు కొట్టుకున్నా వినినవారు హరిశ్చంద్రుని అపార సత్యవర్తనలు విన్న 'ఏమిరా! చక్రవర్తిగాపుట్టి, ఆలుబిడ్డలను కూడ అమ్ముకొని, చావుబ్రతుకుల్లోకూడ నిజంతప్పలేదు. ఎంతకష్టాలైన పడినాడు. ఈ కాస్తకెందుకురా అబద్ధ' మంటారు. ఇంతేకాదు. నేను గజదొంగల విజయాలను వర్ణించానా ఆయుక్తులు, ఆపన్నాగాలు విని దొంగలుగాను, దుష్టులుగాను తయారవుతారు. కనుక నేను పెట్టింది బిక్ష. క్రొత్తబట్టకు చాయ అతికినట్లు నామాట. మహానుభావులు కొందఱన్నారులెండి. వేదములు రాజాజ్ఞలట ధర్మశాస్త్రములు మిత్రతుల్యములట. నేనంటే ప్రియురాలైన భార్యనట. ఆ! జ్ఞాపకము వస్తున్నది. సుదర్శనుని కొమరులను నేనేగా సత్పథములో బెట్టి కండ్లుతెరిపించింది. నన్నుతయారు చేసిన విష్ణుశర్మ సామాన్యుడా! అప్పుడాయన కుక్కలు, నక్కలు, పిల్లులు, కాకులు నాకిచ్చాడు. నేను సాగుతుంటే అవి దేవుడాని మాట్లాడినవి. వెధవది ప్రాణం ఉండేది ఒకలెక్కా! ప్రాణము లేని ముంతా జాడీలుకూడ నేనంటే మాట్లాడుతాయి. గర్వము, బడాయి పనికి రాదని నిమిషములో తీర్మానం చేసేస్తాను.

మహర్షులనుండి వేదములలోను, ఉపనిషత్తులలోను కూడ వ్యాపించినాను. భృగువు, నాచికేతుడు వీరిసంగతి మీకెట్లా తెలిసింది? నేను చెప్పితేనేగా! నా మహాత్మ్యము తెలిసే ఆయా బోధవ్యాంశములు రుచికరముగా బెల్లములో పొదిగిన మందుమాదిరి ఉండుటకు ఆ మహర్షులట్లు అవి నారూపంగా తయారు చేశారు.

ఇంకో వ్యాసుడు నన్నుదీసుకొని పురాణములు, భారత భాగవతాదులు వ్రాశాడు. కాళిదాసు కావ్యములు, నాటకములు రచించాడు. ఎందులోను నేనులేనిది సాగలేదు. పెండ్లికూతురులేని పెండ్లియుండునా? భిత్తికలేని చిత్రరచన యుండునా? నేనులేని తర్కవ్యాకరణాదులెవరైనా తాకుతారేమో చూడండి. రసజ్ఞులెవ్వరూ ఆవైపు పోరు.

కొంతకాలానికి కొంతమార్పు కలిగింది. మొదట నేను బాల్యదశలో ఉండినాన్నమాట. నేను ఋషుల కాలంలో పసికూనవలె యథాశ్రుతంగానే పలికేదాన్ని. కావ్యకర్తలు నన్ను అలంకారాలతో నిండించి నప్పటికీ ముగ్ధత్వంలోనే ఉన్నాను. ఆకర్షణశక్తిమాత్రం ముందటికంటే ఎక్కువే కలిగింది. కానియౌవనం సంప్రాప్తంకాలేదు. వీరేశలింగముగారి కాలంలో నేను ప్రౌఢనయ్యాను. మునుపు 'అనగా ననగా ఒక రాజంటూవచ్చాను. ఇప్పుడో, అనాకొనాలేకుండా, మొదటంజలోనే 'ఏమండోయి! ఈవేళ సినీమాకెళ్దామన్నారుగా' అంటున్నాను. సినీమాలో తారలు తమపూర్వనామధేయము ఎల్లమ్మనియో పుల్లమ్మనియో ఉంటే కమలాదేవి, శచీదేవి అనిమార్చుకున్నట్లు నేనుకూడ ఆయౌవనదశలో పలికేటప్పుడు నాపేరు 'నవల' అని మార్చుకున్నాను. జనులకు నేనంటే నిద్రాహారాలుపనిలేదు. కంటచూస్తే చాలు. ఎత్తుకొని దించనే దించరు. వృద్ధికివచ్చే విద్యార్థులు వృథాగా నాతోనే కాలక్షేపంచేసి నన్నునలిపేస్తారనీ, తామూ చెడిపోతారనీ పెద్దలు కొందరు నాపొత్తు పనికిరాదంటూ ఉపదేశించుతారు. ఆ వీరేశలింగగారు నేను ప్రజాబహుళ్యానికి తెలిసేటట్టు నా పద్యాలతెర తీసేశారు. వచనంగా మార్చారు.

నాటకాల్లో కూడ వయఃపరిణామమునుబట్టి నాకు మార్పుకలిగింది. పూర్వము ఒక అంకమంతా ఒకే ఘట్టమున నన్ను పడవేసేవారు. ఇప్పుడల్లాకాదు. ఒక అంకంలోనే రంగములపేరిట వివిధవిషయములు మార్చి కొంత క్రొత్తశోభ కలిగించారు. దానితో జనులు నాపైకి వచ్చి తోసుకు తిరగడం మొదలెట్టారు.

రంగస్థలంలో చేయుటకు చేతకానిది, చేతయినను వీలుకానిది, చేతయి వీలైనను సిగ్గువిడువనిది హింసానిద్రస్నాన భోజనమైథునాదులు చూపకూడదని పూర్వకాలమున నాట్యాచార్యులు సెలవిచ్చినారు. అప్పుడప్పుడు నేను విష్కంభప్రవేశకాదులలో ఊహామాత్రమున తెరచాటుననే ఉంటిని. ఇప్పుడన్ననో నిజముగా ప్రౌఢదశకువచ్చినాను. నామధ్యదశ నశించింది. సినీమాఇంటిలో అడుగుపెట్టినాను. భయమూ లజ్జా ఏదిలేదు. స్వైర విహారాలు. క్షణములో తత్థ్సానే బొమ్మల సంహారాలు. లెన్సులతో విశ్వరూపదర్శనాలు. పంపులతో ప్రళయవర్షములు. మధ్య నాకేవిచ్ఛిత్తీలేదు. ఏనిషేధాలులేవు. ఏ అసాధ్యమైన పనీలేదు ఏ తెరచాటులులేవు.

నన్నింకను ఒకటిమాత్రంబాధిస్తూనేఉంది. వీధినాటకాల్లో, తమనామధేయాధికారాదులు తామే చెప్పుకొని అసందర్భముగా ఎగిరి గిరగిరతిరుగుట ఏంబాగుంటుంది? వారు ఆపద్ధతులు, ఆదుమకులాటలు వదలక, ఎప్పుడో నాచిన్నప్పుడు చేసిన ఆవ్యక్తపుపనులు, ఆపలికిన మాటలు గట్టిగపట్టుకొని, సినీమా తారనైయుండు నప్పుడుకూడ ఆవేచేస్తుంటే నాకుతలవంపులుగా నున్నాయి.

సాధారణంగా ప్రతివారికీ యౌవనదశలో బుద్ధి వికాసం కలిగి పలుపోకలుపోతుంటారు. నేనూ కవుల చరిత్రగా మారాను. స్వీయచరిత్రగామారాను, భాషాచరిత్రగాను మారాను.

చిలకమర్తివద్ద చిందులుత్రొక్కి, నవ్వి, అందఱిని ఒక్కపెట్టున నవ్వించాను. పానుగంటివారి సాక్షిలో పదములపాటవము నేర్చి నాట్యమాడాను. ఇక నా చిన్న చిన్న విలాసములన్నియు మాసపత్రికలలో చూస్తూన్నారుగా! అయితే నాకు ఒకరిని ఎత్తిపోసే పనిమాత్రం అనకండేం! అవి నా వయసుకుతగిన వ్యంగ్యచేష్టలు.

నన్ను చక్కగా మంచిగా తయారు చేయండి. ప్రజలందఱికీ అర్థమయ్యేటట్లుచేయండి. పాపము! అందరు నన్ను విని తెలుసుకొని ఆనందిస్తారు. 'పరోపకారార్థమిదం శరీర' మన్నారు. గూఢముగాను, కఠినపదములతో ప్రౌఢముగాను వ్రాసి, వారివాత మట్టికొట్టకండి. పామరులకు నేను దర్శనమియ్యకూడదా? వారు వృద్ధిలోకి రాకూడదా? వారికర్థమయ్యేలాగున వ్రాయండి. అప్పుడే మీకు నాకు పేరు. గిడుగువారియెడ నా కృతజ్ఞత విడువను. పూర్వమైతే కృతికర్తలు, కృతిభర్తలు, వినియానందించు శ్రోతలు అందఱూ పండితులే. కవికి రాజాదరణముండు కాలము సాగిపోయినది. ఇప్పుడో కాలము మారినది. ఆ విక్రమార్కుడుగానీ, కృష్ణదేవరాయలుగానీ లేరు. ప్రజల మన్ననలు వడయునట్లు వ్రాసినగాని కవికి కాసురాదు. మఱోమాట. ముఖ్యముగా మనదేశము వృద్ధికివచ్చు బాటలలో నన్ను నడిపించండి; నేనందఱిని గమ్యస్థానంచేరుస్తాను. పనికిమాలినట్లు నన్ను చెడుత్రోవలపెట్టిన ఆ చెడుగే జనసామాన్యమునకు బోధించక తప్పను. ఉరికంబమువద్ద ఉద్యోగములో కుదిరి జీవహింస నేనెట్లు మానుదును?

ఇంకొకమాట. ఇది విమర్శనాయుగము సుమా! మేధావంతులు బాగోగులు గ్రహించుతారు. దూదిపింజలాగు ఏకేస్తారు. నన్ను చక్కగా అలంకరించండి. అట్లంటే ఉపమాద్యలంకారములు గుప్పించి గంగిరెద్దుమాదిరి తయారుచేయుటకాదు. అంతటితో నాకేమి శోభ. భూషణశతములు దిగవేసుకొన్న కురూపిబాలికనెంత ప్రేమింతురో నన్నూ అంతే. చైను, లోలక్కులు, రిస్టువాచి స్లిప్పర్సు వేసినడచుచక్కని నవనాగరిక పద్ధతిలో నడిపించండి. ప్రజామనస్తత్వమెఱిగి రచించాలి. ఏగాలికాచాప. ఆ దూషణ భూషణాలు నాతో పోవు. నన్ను తయారుచేసిన మిమ్మూ చుట్టుకొంటాయి, కవిలోకమా! ఇక సెలవు.

